మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

'కూటమి' బాదుడు ఆగేనా..?

• ట్రూ అప్ పేరిట పెరగనున్న విద్యుత్ భారాలు • 25లోపు అభ్యంతరాలు సేకరించకున్న ఎపిఇఆర్‌సి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వైసిపి జగన్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు అనే కార్యక్రమాన్ని చేసి నిరసన తెలిపిన చంద్రబాబు నాయుడు నేడు ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి మోయలేని భారాలు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ట్రూ ఆఫ్ సర్దుబాటు అంటూ వినియోగదారులు వాడే విద్యుత్ కన్నా ఎక్కువ అదనపు ఛార్జీలు విధిస్తూ సామాన్య ప్రజలు నడ్డి విరిచేందుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ట్రూఆఫ్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం మళ్లీ దాదాపు రూ.12 వేల కోట్లు పెంచేందుకు సిద్ధమవుతోంది. ఈనెల 25 లోపు వినియోగదారులు తమ అభ్యంతరాలు తెలపాలని (ఎపిఇఆర్‌సి) ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చెప్పింది. ఈ అభ్యంతరాలు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అడుగుతుంది. తూతూ మంత్రంగా నిర్వహించి అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏది అనుకుంటే అది చేస్తూ ప్రజలపై భారాలు వేస్తూనే ఉంది. పెరిగిన బిల్లులు చూసుకుంటే అసలు విద్యుత్ యూనిట్ ధర కన్నా అదనపు చార్జింగ్ ఎక్కువ అవుతున్నాయి. దీనితో వినియోదారులు లబోదిబో అంటున్నారు. ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పార్టీలు వినియోగదారుల పక్షాన ఏకంగా రోడ్లపైకి వచ్చి రాస్తారోకోలు కార్యాలయాలు ముందు ధర్నాలు, నిరసనలు తెలిపినా ఏమాత్రం స్పందించకుండా అధికారులు, పాలకులు దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి ప్రజలు ఏమైతే మాకేమి అని అధికారంలో ఉన్న ప్రభుత్వం భారాలు వేస్తూ పోతుంది. ఒకపక్క ఇంధనం పెట్రోల్ ,డీజిల్ ధరలు పెరిగి వాటి ప్రభావం వల్ల నిత్యవసర సరుకులపై పడి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ప్రజలపై ప్రభుత్వాలు భారాలు వేస్తూనే ఉంది. 2023 -24 సంవత్సరానికి సంబంధించి రూ.3700 కోట్లను డిస్కంలు ఇప్పటికే వినియోగదారుల నుండి ముక్కు పిండి వసూలు చేశాయి. ఇవి కాకుండా 2022-23 సంవత్సరానికి సంబంధించి సర్దుబాటు పేరుతో రూ.6.072 కోట్లు వినియోగదారుల నుండి వసూలు చేసుకోవాలని 20 రోజుల క్రితమే ఎపిఇఆర్‌సి ఉత్తర్వులు విడుదల చేసింది. మళ్లీ ఇప్పుడు మరో రూ.ఎనిమిది వేల కోట్లు వసూలు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరింది.

అందరికీ స్మార్ట్‌మీటర్లు సిద్ధం : వీటికి తోడుగా విద్యుత్ శాఖ ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను బిగించింది. తరువాత 200 యూనిట్ల పైబడి విద్యుత్తు వినియోగ దారులందరి ఇండ్లకు కూడా స్మార్ట్ మీటర్లను బిగించడం ప్రారంభించింది. ఈ మీటర్లు బిగిస్తే ముందుగా సెల్ఫోన్‌రీఛార్జ్ చేసుకున్నట్టు ముందుగా డబ్బులు కట్టాల్సి ఉంటుంది. డబ్బులు అయిపోయిన వెంటనే మళ్ళీ రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేసుకోకపోతే విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. ప్రభుత్వంమోసపూరితమైన విధానాన్ని రద్దు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి ఆలంబిస్తూ ప్రజలపై భారాలు వేస్తూపోతే వైసిపికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ప్రజలను మోసం చేయడమే

- ఎ. బాలరాజు మాజీ కార్పొరేటర్

2014లో జగన్ ప్రభుత్వం చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచారు. దాదాపు రూ.12 వేల కోట్ల ప్రజలపై భారాలు వేసేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 19వ తేదీ లోపల వినియోగదారుల నుండి అభ్యంతరాలు తెలపాలని కోరారు. మళ్లీ ఈనెల 25కు పెంచారు. ఇది అంతా ఒక డ్రామా మాత్రమే. ఎన్నికల ముందు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచబోమన్నారు. విద్యుత్ చార్జీలు పెంచితే ధనికులకు ఏమాత్రం ఇబ్బంది అనిపించదు. మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుంది. విద్యుత్ చార్జీలో పెంచే ఆలోచనను విరవించుకోవాలి.

సామాన్య ప్రజలు ఈ భారం మోయలేరు

- నయీమున్నిసా, గృహిణి, పాతబస్తీ

సామాన్య ప్రజలపై ఈభారాలు వేయడం సరికాదు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలల లోపలనే రకరకాల భారలు ప్రజలపై వేయడం మొదలుపెట్టింది. చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామంటూ ప్రగల్బాలు పలికి గద్దనెక్కాడు. పథకాలను పక్కనపెట్టి విద్యుత్ భారాలు పెంచడానికి సిద్ధమయ్యాడు. నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్య ప్రజలు కొని తినలేని పరిస్థితి ఉంది. చాలీచాలని కూలీ వేతనాలతో సామాన్య ప్రజలు బతుకు భారంగా గడుపుతున్నారు. ఇలాంటి సమయంలో విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదు. జగన్‌కు చంద్రబాబుకు ఏమాత్రం తేడా లేదు. మహిళా సంఘాలను ఐక్యం చేసి ప్రభుత్వ విధానాల వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

అదానీని అరెస్టు చేయాలి

- జాయింట్ పార్లమెంట్ కమిటీతో విచారించాలి
- ఆ సంస్థ చేపట్టిన ప్రాజెక్టులన్నిటిని రద్దు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్పొరేట్ కంపెనీగా ఉన్న ఆదాని గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గౌతమ్ అధాని తాను చేసిన అవినీతి మరకలతో దేశగౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో మంటగలిపారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ అన్నారు. శనివారం కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో ఆదాని అవినీతికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి న్యూ సిటీకార్యదర్శి టి.రాముడు అధ్యక్షత వహించాడు డి.గౌస్‌దేశాయి మాట్లాడుతూ సెకీనుండి రాష్ట్ర డిస్కమ్‌లంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకునేందుకు ఆదాని గ్రూపులు భారీ ఎత్తున ముడుపులు చెల్లించిందన్నారు. అందుకుగాను అమెరికా కోర్టులో వ్యాజ్యం నమోదు అయిందన్నారు. సెకీ నుండి ఎపి డిస్కమ్‌లతో సౌరవిద్యుత్ కొనుగోలు ఒప్పందం చేయడానికి 2019 - 24 మధ్య అధికారంలో ఉన్న వారికి రూ.1750 కోట్లు ముడుపులు చెల్లించినట్లు అమెరికాలో కేసు నమోదు అయిందన్నారు. ఈ ఒప్పందం రాష్ట్రానికి తీవ్ర నష్టం చేకూర్చుతుందని సిపిఎం మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వస్తుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో,దేశంలో అదానిగ్రూపుతో ప్రభుత్వం చేసుకున్న అన్ని ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెకీ ఒప్పందం మాత్రమే కాకుండా రాష్ట్రంలో పంపుడు స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, విశాఖలో డేటా సెంటరు, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్ట్ సంస్థలతో చేసుకున్న ఒప్పందం పేరుతో ప్రభుత్వ ఆస్తులను, ప్రజల సంపదను వారికి అప్పటి ప్రభుత్వం ఒప్పందం చేసిందన్నారు. ఆదాని గ్రూపు చేసిన అవినీతి రోతను హిడెన్‌బర్గ్ నివేదిక ద్వారా అప్పట్లోనే కుండలు బద్దలు కొట్టిందన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు అదానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, అందుకోసం పార్లమెంటరీ జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సాయి బాబా, కె.సుధాకరప్ప. జి.ఏసు, బి.రామర్రుష్ణ. వి.శంకర్. జె.శ్రీనివాసులు. భీసన్న, నాగరాజు, మనోహర్, చిన్నబడేసా, పరశురాముడు, నారాయణమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జెసిలకు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కర్నూల్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నాడు జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష జాయింట్ కలెక్టర్ బి నవ్యాలను అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు లక్ష్మి రాజు, కోశాధికారి వేణుగోపాల్ ఉపాధ్యక్షులు లోకేశ్వరి స్పోర్ట్స్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి కర్నూల్ డివిజన్ అధ్యక్షులు రామాంజనేయులు కార్యదర్శి వేణుగోపాలరావు కోశాధికారి సహారా బాను లు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్లకు జ్ఞాపకలను అందజేశారు. అలాగే డిఆర్ఓ వెంకట్ నారాయణమ్మ ఏవో విజయ శ్రీ డి ఎస్ ఓ రాజా రఘువీర్లను కూడా కలిసి అభినందించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బాల్య వివాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శనివారం మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ నయా చేతన ద్వారా జెండర్ వివక్ష, వ్యతిరేకంగా కార్యాచరణకు సంబంధించి జిల్లా స్థాయికోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...లింగ వివక్షకు అవకాశం లేకుండా ఉండాలని, పిఎన్‌డిటి యాక్ట్‌ను అమలు చేస్తున్నారని, అమ్మాయిలు 18 సంవత్సరాలు వయసు వచ్చాకే వివాహం చేయరాదన్నారు. బాలికలు స్వతహాగా సంపాదించే వరకు , కుటుంబ పోషణ చేసే స్థాయి చేరేవరకు వివాహం జరపటం మంచిది కాదన్నారు. అన్ని శాఖల సమన్వయంతో జెండర్ వివక్ష, హింసకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 23 వరకు జెండర్ ఆధారిత హింస, ఆడపిల్లలకు విద్య, బాల్యవివాహాలు అరికట్టడం,గృహ హింస నిరోధక చట్టం పై కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జ్ డిఆర్‌డిఎ పిడి శివలీల, జాయింట్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ రంగ లక్ష్మీదేవి, డిపిఆర్ఓ జయమ్మ, డిఇఒ శ్యాముల్ పాల్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, పిడి డ్వామా వెంకట రమణయ్య, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి శ్రీనివాసచారి, డిపిఒ భాస్కర్, నాగప్రసాద్ బాబు, డిఎంఅండ్‌హెచ్ఒ, ఐసిడిఎస్ సూపరిండెంట్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

కల నెరవేరేనా..?

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు కోసం ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు సిఎం కార్యాలయం నుంచి న్యాయశాఖకు వచ్చిన లేఖతో ప్రక్రియను న్యాయశాఖ మొదలుపెట్టింది. బెంచ్ ఏర్పాటుకు సంబంధించి హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌కు న్యాయశాఖ కార్యదర్శి సునీత లేఖ రాశారు. మంత్రి మండలి సమావేశం కూడా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసింది. అమరావతిలో హైకోర్టు కొనసాగుతూనే హైకోర్టు బెంచ్ కర్నూలులో అందుబాటులోకి రానుంది. గతంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని, హైకోర్టు కర్నూలుకు తరలిస్తామని పలు సార్లు ప్రకటనలు చేశారు. కర్నూలు హైకోర్టు ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలూ పంపలేదు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథగట్టు సమీపంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. అది కూడా శంకుస్థాపనకే పరిమితమైంది. తరువాత ఎలాంటి పనులూ చేపట్టలేదు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేశారు. ఆ నేపథ్యంలో కర్నూలుకు వచ్చిన చంద్రబాబు నాయుడును వైసిపి నాయకులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్ర చేపట్టిన సందర్భంగా టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీల మేరకు టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. దీనిని కర్నూలు న్యాయవాదులు స్వాగతిస్తున్నారు. వీలైనంత త్వరగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్మార్ట్ దోపిడీకి సిద్ధం...

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందికి రాబోతున్నాయి. ఒక్కో స్మార్ట్ మీటర్ను రూ.12 వేలు పెట్టి కొనాల్సి ఉంటుంది. ఈ భారాన్ని వినియోగదారుడే భరించాలి. స్మార్ట్ మీటర్లను అందించే వెసలుబాటును అదాని గ్రూప్ సంస్థకు ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిసింది. విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు సిద్ధమయారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తయ్యాక రెండో విడతగా వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఆ తరువాత మూడో విడతగా గృహలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. స్మార్ట్ మీటర్లను వినియోగించుకుంటే నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేయాలంటే ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకోవాలి. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి.

లక్ష్యం చేరని గూడు...

ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ఉమ్మడి జిల్లా పూర్తిగా వెనుకబడింది. ఉన్నతాధికారులు నిత్యం సమీక్షిస్తున్న క్షేత్రస్థాయిలో పురోగతి కానరావడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వంద రోజులకు గాను 10,534 ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా తీసుకోగా ఈనెల 15 నాటికి 1230 ఇళ్లను మాత్రమే నిర్మాణం చేశారు. కర్నూలు జిల్లాలో 6,672 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 564 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు. 50 రోజుల్లో 8.45 శాతం లక్ష్యం మాత్రమే చేరుకున్నారు. నంద్యాల జిల్లాలో 3,862 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 666 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు. 50 రోజుల్లో 17.24 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న పిఎస్.రాధాకృష్ణ

వాలంటీర్లను కొనసాగించాలి

చంద్రబాబుఇచ్చిన హామీని అమలు చేయాలి
సిఐటియు నేతలు రాధాకష్ణ ,అంజిబాబు డిమాండ్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

గ్రామ, వార్డు వాలంటీర్లను కొనసాగించాలని ఎన్నికల కంటే ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు .వాలంటీర్లను కొనసాగించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఎపి గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు) ఇచ్చిన పిలుపులో భాగంగావాలంటీర్లు ఆందోళన చేపట్టారు. వాలంటీర్ల సంఘం నాయకుడు సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిఎస్ రాధాకృష్ణ, ఎండి అంజిబాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం వారిని కొనసాగిస్తూ రూ.పదివేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మంత్రి చేసిన ప్రకటనను ఉపసంహరించుకోవాలని కోరారు. మంత్రి బాల వీరాంజనేయ స్వామి వాలంటీర్ల విషయంలో ప్రజలకు అసత్యాలు చెప్తున్నారని, వాలంటీర్లను గత ప్రభుత్వమే రెన్యువల్ చేయలేదని చెబుతున్నారని అన్నారు. 2023 ఆగస్టు తర్వాత వాలంటీర్లను రెన్యువల్ చేయ లేదని చెబుతున్నారని, అలాంటప్పుడు 2024 మే వరకు వేతనాలు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ,పెండింగ్ లోఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం విఆర్ఓ వెంకటలక్ష్మికి వినతి పత్రం అందించారు. వాలెంటీర్ల సంఘం నాయకుడు సుధాకర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, డివైఎఫ్ఐ నగర నాయకులు హుస్సేన్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి అమర్, వాలంటీర్ల సంఘం నాయకులు చక్రపాణి, తేజస్, జావిద్, సురేఖ,భాను తదితరులు పాల్గొన్నారు.

తేనీటి విందులో మంత్రి సవిత

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్



బీసీ సంక్షేమశాఖమంత్రి సవిత కర్నూలు జిల్లా కేంద్రంలోని 17 వార్డు ఎ.క్యాంపులో కీర్తిశేషులు డాక్టర్ పుల్లన్న కూతురు శ్రీలీలమ్మ గృహానికి విచ్చేసి తేనేటి విందులో పాల్గొన్నారు.కర్నూలు జిల్లా కురవ సంఘం నాయకులు గుడిసె శివన్న, ఎం. కె.రంగస్వామి, ధనుంజయ, పాలసుంకన్న, బి.వెంకటేశ్వర్లు తిరుపాలు, పుల్లన్న, శివ, కాలింగ, జితేంద్ర, చంద్రమోహన్ పాల్గొన్నారు.

యువత దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

-సినీ నటుడు సుమన్-ఘనంగా క్లస్టర్ యువతరంగ్ కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని సినీనటుడు సుమన్ విద్యార్థులకు సూచించారు. శనివారం కర్నూలు బి క్యాంపులోని క్లస్టర్ యూనివర్సిటీ ప్రాంగణంలో 'క్లస్టర్ యువతరంగ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సినీ నటుడు సుమన్, వర్సిటీ వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్, రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లు , కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు హాజరయ్యారు. సుమన్ మాట్లాడుతూ మనిషి ఉన్నతికి చదువు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పునాది చదువు బలంగా ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించడం పెద్ద కష్టం కాదన్నారు. యువతరం దేశ ఉన్నతికి కృషి చేయాలన్నారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే తన వాళ్లనే ద్వేషిస్తారని, ఈ విషయాన్ని గమనించాలని గుర్తు చేశారు. సైన్యంలో సైనికుడు కష్టపరిస్థితుల్లో దేశాన్ని ఎలా కాపాడతాడో మనం మన తల్లిదండ్రులను కాపాడాలన్నారు. డివిఆర్ సాయి గోపాల్ మాట్లాడుతూ సమాజంలో సమస్యలు లేని వ్యక్తి అంటూ ఉండడని వాటిని ఎదుర్కొని విజయం సాధించినప్పుడే మన శక్తి ఏమిటో నిరూపితం అవుతుందన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలు చేరుకున్నప్పుడే ఎక్కువ సంతోషిస్తామన్నారు. క్రీడాపోటీల్లో గెలు పొందిన అధ్యాపకులు విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్స్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్, డాక్టర్ పర్మెన్ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ ఎం.ఇందిరా శాంతి. ఉపకులపతి ఒఎస్ డి డాక్టర్ ఎస్ఎన్ బాష, పిఆర్ఒ డాక్టర్ పార్వతి దేవి, ఎపిఆర్ఒ డాక్టర్ వింధ్య వాసిని, డాక్టర్ వై.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్, డీన్ డాక్టర్ హెచ్.అక్తర్ భాను, డీన్ డాక్టర్ మహమ్మద్ వాయిద్, డాక్టర్ ఎల్లకృష్ణ, డాక్టర్ సోమశేఖరు, డాక్టర్ పార్వతి, డాక్టర్ అనూష, సినీగాయకుడు కరీముల్లా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ యువతరంగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్

12 మోటార్ సైకిల్లు, ఒక ఆటో స్వాధీనం-విలువ రూ.9,10,000
-కర్నూలు టౌన్ డిఎస్‌పి బాబు ప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూల్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో తరచుగా మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేశామని కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ తెలిపారు. శనివారం కర్నూలు మూడవ పట్టణం పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు నగర పరిధిలో మోటర్ సైకిళ్ల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి నివారణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ ఆదేశించారు. ఆయన ఆదేశానుసారం తన ఆధ్వర్యంలో మూడో పట్టణ సిఐ శేషయ్యతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టేమన్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని స్థానిక నంద్యాల చెక్పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలను చేపడుతుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించారన్నారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. అతని పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించగా సదరు వ్యక్తి నంద్యాల జిల్లా, డోన్ పట్టణం, కొండపేటకు చెందిన నాగుల వినయ్ గా గుర్తించారన్నారు. సదరు వ్యక్తి 13 కేసుల్లో నిందితుడిగా తేల్చామన్నారు. ఈ కేసుల్లో 12 మోటార్ సైకిళ్లతో పాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి మొత్తం విలువ రూ.9,10,000 ఉంటుందన్నారు. నిందితున్ని రిమాండ్కు పంపనున్నామన్నారు. ఇతర కేసులో ఏమైనా ప్రమేయం ఉందన్నది తదుపరి విచారణలో తేలనొందన్నారు. ఈ కేసులో ప్రత్యేకత ప్రతిభను కనపరిచిన ఎస్ఐ మన్మధ విజయ్, సిబ్బంది ఎం సి రంగారావు, బాల ప్రసాద్ సింగ్, ఎం తిరుమలేష్, జే.వీరేష్, ఎం.కిరణ్, నాగరాజు, సిసిఎస్ సిబ్బంది నాగరాజు, శేఖర్, బి.శివను అభినందించారు. వారికి రివార్డులు అందించడానికి ఎస్‌పికి నివేదిస్తామని తెలిపారు. మోటారు సైకిళ్ల వాహనదారులు వాహనాలకు తప్పకుండా తాళం వేయాలని, సిసి కెమెరాలు నిఘాలో ఉండే ప్రాంతాల్లో వాహనాలను ఉంచి వెళ్లాలని కోరారు. ఇంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు అనుమానాస్పద వ్యక్తుల గురించి డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే డయల్ 1930 నెంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

పట్టుబడిన వాహనాలు

ఎంపి కార్యాలయానికి వచ్చినమంత్రి సవితను సన్మానిస్తున్న బస్తిపాటి నాగరాజు

బిసి సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్లకు ఎంపి నిధులు

మంత్రి సమక్షంలో బస్తిపాటి నాగరాజు వెల్లడి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లాలోని బిసి సంక్షేమ వసతి గృహాలు , రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు ఎంపి నిధులు నుంచి రూ.ఒక కోటి కేటాయిస్తున్నట్లు ఎంపి బస్తీపతి నాగరాజు తెలిపారు. నగరంలోని ఎంపి కార్యాలయాన్ని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపి నాగరాజు బిసి సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతు లకు రూ.కోటి తనకు వచ్చే నిధుల నుంచి వెచ్చిస్తానని మంత్రి సవిత సమక్షంలో తెలిపారు. దీని పై హర్షం వ్యక్తం చేసిన మంత్రి ఎంపి నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు మంత్రి సవితను ఎంపి నాగరాజు శాలువతో సత్కరించి , పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, డైరెక్టర్ రామకృష్ణ కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

కర్నూలు స్టాంటన్‌పురంలో రూ. 1.10 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ సాంబశివరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్.భాస్కర్, నగరపాలక ఎస్ఇ జి.రాజశేఖర్, ఎంఇ సత్యనారాయణ, డిఇఇ గిరిరాజు, ఎఇ ఖాసిం వలి, శానిటేషన్ ఇంస్పెక్టర్ ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

రీసర్వే వినతుల పరిష్కార దిశగా అడుగులు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - హొళగుంద

రీసర్వే వినతుల పరిష్కార దిశగా అడుగులు వేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం రీ సర్వే జరిగిన గ్రామాల్లో సమస్యల పరిష్కార దిశగా అధికారులు ఏ మేర కృషి చేస్తున్నారని.. నాగరకనివి, సులువాయి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన రీ సర్వేలో రైతుల విస్తీర్ణంలో తేడాలపై మరోసారి సర్వే చేసి, సబ్ డివిజన్ చేసి ఇవ్వడం, ఇతర ఇబ్బందులపై గ్రామసభల్లో రైతులు ఇచ్చిన వినతులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మిగులు భూములకు తగిన ఆధారాలుంటే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏ రైతు కూడా ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. తహశీల్దార్ సతీష్ పాల్గొన్నారు.

త్వరగా 'మినీ గోకులం'ను పూర్తి చేయాలి

- ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఒ జుబేర్ అహ్మద్



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో మినీ గోకులం షెడ్లు మంజూరయిన వారందరూ పూర్తి చేసుకుంటే ప్రభుత్వం బిల్లులు చెల్లించటానికి సిద్ధంగా ఉందని ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఒ జుబేర్ అహ్మద్ తెలిపారు. శనివారం దౌల్తాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సుధీర్, టిడిపి నాయకులు మేకల రామాంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులు రూ.1.80 లక్షలతో కె.శ్రీనివాసులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును సర్పంచి లక్ష్మీ దేవమ్మ, అధికారులు పూజ నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోకులం షెడ్లు రైతులకు, పాడి పశువులకు, వ్యవసాయ పనిముట్లు పెట్టుకోవడానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. వలసలు వెళ్లవద్దని, గ్రామంలోనే పనులు కల్పిస్తామని ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఒ జుబేర్ అహ్మద్ తెలిపారు. ఉపాధి మండల కోఆర్డినేటర్ సురేష్, సిటిఎ ఉలిగప్ప, టెక్నికల్ అసిస్టెంట్ మారుతి, టిడిపి నాయకులు లక్ష్మన్న, ప్రభాకర్, మస్తాన్, రాముడు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

- వ్యకాస, ఎఐటియుసి, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు శ్రీరాములు కోరారు. శనివారం సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికుల కు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, 8 గంటల పని, హక్కులు రద్దు కాబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని గుర్తు చేశారు. రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు నాగేష్, పాండు, నాగరాజు, యూసుఫ్ బాషా, బలరాముడు, బడే సాహెబ్, రాఘవేంద్ర, భాస్కర్, మధు, శంకర్, శ్రీనివాసులు, మహేష్, మహేంద్ర, పెద్దయ్య, రాముడు, బండ్లయ్య, చిన్నరాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీర శేఖర్

మహిళా హక్కులను పరిరక్షించుకోవాలి

• ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ

ప్రజాశక్తి - ఆలూరు

విద్యార్థినులు, మహిళలు సమస్యలపై పోరాడి హక్కులను పరిరక్షించుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ తెలిపారు. ఈనెల 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, మహిళ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆలూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 'మహిళల భద్రత.. రక్షణ-మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలి, మహిళలు, పసి పిల్లలపై అత్యాచారాలు, దాడులను అరికట్టాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై హింస పెరిగిపోతోందని, మద్యం, మత్తు పదార్థాలను సేవించి వికృత చేష్టలు చేస్తున్న మానవ మృగాలను ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. రోజా మహిళలు, చిన్నారులపై హింస పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను రక్షించాల్సిన చట్టాలు ధనవంతులకు, అధికార పక్ష నాయకులకు చుట్టాలుగా మారుతున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరూ బాధ్యత వహిస్తూ మనపై, పక్కన, వీధిలో, గ్రామంలో విద్యార్థినులు, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించినా, దాడి చేసినా ధైర్యంగా ఎదుర్కొని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. లేదా తల్లికి, పాఠశాల గురువులకు, మహిళా సంఘాలకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేయబోతున్నా, చేస్తున్నా దగ్గరలోని పోలీసులకు, ఐసిడిఎస్(అంగన్వాడీ), మహిళా సంఘాలకు సమాచారం ఇవ్వాలని కోరారు. అడ్వకేట్ షాకీర్, పాఠశాల ఉపాధ్యాయులు గిరయ్య, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పద్మ, కోశాధికారి సుజాత, మండల అధ్యక్షులు షేకున్‌బీ, నాయకులు గౌసియా, రాధమ్మ, డివైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఉమేష్, నాయకులు బోటయ్య, బసవరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ

సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ దిలీప్ కుమార్

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాలస్వామి

ప్రజాశక్తి - ఆదోని

సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాలుపంచుకోవాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. తలసేమియా బాధిత పిల్లల కోసం శనివారం ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ ఆదర్శ పౌరుడుగా మెలిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆదోని ప్రభుత్వాస్పత్రి వైద్యులు జగదీష్ మాట్లాడుతూ... రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలూ తలెత్తవని, అపోహలు విడనాడాలని సూచించారు. 40 మంది విద్యార్థులు రక్త దానం చేశారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ... తలసేమియా బాధిత పిల్లలకు రక్తం చాలా అవసరమని, రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జొనాథన్, వెంకట్రామి రెడ్డిలు పర్యవేక్షించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలస్వామి

కూటి కోసం.. కోటి విద్యలు

తాడుపై విన్యాసం చేస్తున్న బాలిక

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'కూటి కోసం కోటి విద్యలు' అన్నారు పెద్దలు. ఈ ఫొటో చూస్తే అది నిజమనిపించక మానదు. అందరిలానే చదువుకుని, తోటి పిల్లలతో ఆడుకోవాల్సిన ఈ బాలిక ఇలా ప్రమాదర విన్యాసాలు చేసి ఔరా అనిపించింది. శుక్రవారం రాత్రి మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఓ వీధిలో ఒక తాడుపై పట్టు తప్పకుండా నడిచి అందరినీ ఆశ్చర్యపర్చడమే కాకుండా ప్రశంసలు కూడా అందుకుంది. పదేళ్ల బాలిక చేసిన ఈ విన్యాసాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. కొందరు తమకు తోచిన సహాయం చేశారు.

అవయవదానంపై అవగాహన అవసరం

- మేము సైతం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దయాసాగర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అవయవ దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మేము సైతం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దయాసాగర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. జీవించి ఉన్నంత కాలం ప్రతి అవయవంతో మనిషి జీవనం సాగుతుందన్నారు. మృతి చెందిన తర్వాత అవయవాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయన్నారు. నేడు కళ్లు లేనివారు, అలాగే అనారోగ్యాలకు గురై సరైన సమయానికి అవయవాలు అందక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రక్తదానంతో పాటు అవయవ దానం కూడా పాటించాలని కోరారు. జాతీయ అవయవదాన దినోత్సవాన్ని ప్రతేడాది ఆగస్టు 13న జరుపుతున్నారని చెప్పారు. పట్టణంలోని వ్యాపారులు కాసుల రాము శెట్టి, సి.రాఘవేంద్ర శెట్టి అవయవ దానానికి అంగీకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం అవయవ దాతలకు అంగీకర పత్రాన్ని అందించారు. సంస్థ నిర్వాహకులు లక్ష్మణ్, సాగర్, నరసింహులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న దయాసాగర్

పురుగుమందు తాగి చచ్చినా..!

• సమస్యను పరిష్కరించేది లేదు
• రైతులపై విఆర్ఒ దురుసు ప్రవర్తన
• తహశీల్దార్‌కు రైతుల వినతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

'మీరు పురుగు మందు తాగి చచ్చినా సమస్యను పరిష్కరించేది లేదు' అంటూ విఆర్ఒ దురుసుగా ప్రవర్తించినట్లు రైతులు వాపోయారు. తమ తల్లి చనిపోవడంతో ఆమె పేరుపై ఉన్న భూమి విస్తీర్ణం రీసర్వేలో తప్పుగా నమోదైందని, ఆ తప్పును సరిచేసి తమ తల్లి భూమిని తమ పేర్లపై ఆన్‌లైన్ చేయాలని కోరుతూ రైతులు విఆర్ఒను సంప్రదించారు. వారిపై విఆర్ఒ అనుచితమైన వాఖ్యలు చేయడంతో సంబంధిత రైతులు శనివారం గోనెగండ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తమపై అనుచితంగా మాట్లాడిన విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. మండలంలోని వెముగోడు గ్రామానికి చెందిన మాల మాదక్కకు తిప్పనూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 465-1లో 3.19 ఎకరాల పొలం ఉంది. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జగనన్న భూ రక్ష రీసర్వేలో ఆమె పొలం విస్తీర్ణం కేవలం 0.38 సెంట్లుగా నమోదయింది. ఆమె మరణించడంతో ఆమె కుమారులు రీ సర్వేలో జరిగిన తప్పును సవరించి తమ తల్లి పేరుపై పూర్తి విస్తీర్ణం నమోదు చేయడంతో పాటు భూమిపై అనుభవంలో తామే ఉన్నందున తమ పేర్లపై ఆన్‌లైన్ చేయాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెప్పడంతో ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు. తమ సమస్యను పరిష్కరించమని గత కొద్ది నెలలుగా తిప్పనూరు విఆర్ఒ ఈశ్వర్ రెడ్డి, సర్వేయర్ ఉమామహేశ్వరిని కోరుతున్నారు. 'మీరు పురుగు మందు తాగి చచ్చినా సమస్య తీర్చను. ఎవరికి చెప్పుకుంటారో.. చెప్పుకోండి. నాకేమీ కాదు' అంటూ విఆర్ఒ ఈశ్వర్ రెడ్డి అనుచితమైన వ్యాఖ్యలు చేస్తున్నారని బాధిత రైతు కుటుంబానికి చెందిన వెముగోడు గ్రామస్తులు మాదన్న, అయ్యస్వామి, కన్నయ్య మరి కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, ఇలాంటి వ్యాఖ్యలు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ కుమారస్వామిని వివరణ కోరగా... రైతుల ఫిర్యాదుపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇతర సిబ్బందితో వారి సమస్యను పరిష్కరిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

భోజనాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ శివ రాముడు

'ఓటరు నమోదు'ను సద్వినియోగం చేసుకోండి

- తహశీల్దార్ శివ రాముడు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శివరాముడు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాంబగల్లు 74వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్పెషల్ సమ్మర్ రివిజన్ 2025లో భాగంగా నియోజకవర్గంలో జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు కార్డులో పేరు, చిరునామా, వివరాల్లో ఏదైనా తప్పులుంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన తహశీల్దార్

సాంబగల్లు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ... మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

శబ్దాలతో ఇబ్బందులు

- కమీషనర్‌కు మహిళల వినతి

ప్రజాశక్తి - ఆదోని

నివాసాల మధ్య ఇంజినీరింగ్ వర్క్ యంత్రాల వల్ల వచ్చే శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పద్మ తెలిపారు. శనివారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు మహిళలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలోని పాత ఫ్లైఓవర్ బ్రిడ్జి, రేణుకాంబ హోటల్ సమీపంలో తమ నివాసం ఉందన్నారు. ఇంటికి ఆనుకుని ఇటీవలే ఇంజినీరింగ్ వర్క్‌కు సంబంధించిన మిషన్ ఏర్పాటు చేసుకొని పెద్ద శబ్ధం వచ్చేలా మోటార్లు ఆడిస్తూ పని చేస్తున్నారని తెలిపారు. ఈ శబ్దాల వల్ల ఇళ్లలో వైబ్రేషన్ పెరిగి సామాన్లు కిందపడి పోతున్నాయన్నారు. ఇళ్ల మధ్యలో పెద్ద శబ్దాలు వచ్చేలా పనులు చేయడం ఏమిటని అడిగితే తమపై దౌర్జన్యం చేస్తున్నారని విన్నవించారు. ఇళ్లు లేనిచోట ఇంజినీరింగ్ వర్క్ షాప్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని కమిషనర్ కృష్ణ తెలిపారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

వాలంటీరు వ్యవస్థపై మాట మార్చిన కూటమి

- వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్రంలో వాలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని, జీతాలు కూడా రూ.10 వేలకు పెంచుతామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చి తప్పిందని వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య విమర్శించారు. శనివారం ఆయన చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి వ్యవస్థ బాగా నడపడానికి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందడానికి అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. అమలు చేతకాక వాలంటీరు వ్యవస్థను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొనడం అసమంజసమని విమర్శించారు. వాలంటీర్లు కూడా ఉద్యమ బాట పట్టారని, వారికి అండగా నిలబడతామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం వాలంటీరు వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

29న మందకృష్ణ మాదిగ రాక

- ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 29న ఉమ్మడి కర్నూలు జిల్లాకు మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు బండారి గిడ్డయ్య మాదిగ, పట్టణ కన్వీనర్ వన్నెల మణికంఠ మాదిగ తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. ఈనెల 29 ఉమ్మడి కర్నూలు జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గం నుంచి మాదిగలంతా కలిసి రావాలని తెలిపారు. ఎంఆర్‌పిఎస్ మాజీ అధికార ప్రతినిధి నరసింహ మాదిగ, పట్టణ కోకన్వీనర్ జిఎస్.దత్తు, మండల మాజీ అధ్యక్షులు శాంతరాజు మాదిగ, మండల మాజీ ఉపాధ్యక్షులు కపటి ఈరన్న మాదిగ, సీనియర్ నాయకులు శాంత రాజు మాదిగ, తిప్పన్న మాదిగ, దిబ్బనకల్లు గ్రామ ఉపాధ్యక్షులు అధ్యక్షులు మారెప్ప మాదిగ, పూజారి హనుమంతు మాదిగ, మండగిరి వార్డు కన్వీనర్ మాదాసు, వీరాంజనేయులు, దిబ్బనకల్లు మాదాసు వీరభద్ర పాల్గొన్నారు.

జాబితాలో తప్పులు...

• 'అంతా మా ఇష్టం' అంటున్న అధికారులు
• అయోమయంలో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ ఉద్యోగుల ఖాళీల జాబితా తప్పల తడకగా మారింది. ఇదేమని ప్రశ్నించిన ఉపాధ్యాయులపై సంబంధిత అధికారులు పొంతన లేని సమాధానం చెబుతూ 'అంతా మా ఇష్టం' అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఖాళీల గుర్తింపులో విపరీతమైన ఆలస్యం అవుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఇటీవల మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఈనెల 8 నాటికి ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి కావాల్సింది. 70:30 విధానంలో పోస్టుల గుర్తింపులో దొర్లిన తప్పులపై ఫిర్యాదులు రావడంతో లోపాలను సరిజేయాలని రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈనెల 16న వెబెక్స్ మీటింగ్ ద్వారా సూచించారు. ఈనెల 18లోపు నిర్దేశించిన ప్రొఫార్మాలు భర్తీ చేసి ఇవ్వమని డివిజనల్ విద్యాశాఖ అధికారులనూ, ఆయా మున్సిపల్ కమిషనర్లనూ జిల్లా విద్యాశాఖ అధికారి కోరినట్లు సమాచారం. ఆదోని పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల సంఖ్య అంతుచిక్కడం లేదు. పాఠశాల సహాయకులు ఆంగ్లంలో మొత్తం 12 పోస్టులు మంజూరు కాగా, 12 మంది ఆంగ్ల పాఠశాల సహాయకులు పని చేస్తున్నారు. ఇందులో ఆరుగురు నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో, ఐదుగురు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో, ఒకరు లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు. ఒక ఖాళీ చూపిస్తున్నారని ఉపాధ్యాయులు అభ్యంతరం చెబుతున్నారు. నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో రెండు భౌతిక శాస్త్ర పాఠశాల సహాయకుల పోస్టులు ఖాళీ ఉండగా విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాళీల ప్రకటనపై మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. అనధికారికంగా అగెనెస్ట్ పోస్టులో కొనసాగుతుండడం వల్ల ఉద్యోగోన్నతి పొందే ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని, దీనిని సవరించాల్సి ఉండగా.. అలాంటి వారికే సానుకూలంగా ఈ పోస్టును బ్లాక్ చేసే అవకాశం ఉందని అర్హత గల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2010లో మంజూరయి 2015 ఏప్రిల్‌లో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ అయిన మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గల తెలుగు పాఠశాల సహాయకుల పోస్టును లేబర్ కాలనీలోని మరో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2010లోనే మంజూరు చేసి, భర్తీ చేసినట్లు డివిజనల్ అధికారి కార్యాలయం సిబ్బంది అధికారికంగా ప్రకటించారు. ఈ పోస్టును గతేడాది డిఇఒ అన్నీ తానై లేబర్ కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలకు ఆ పోస్టును షిఫ్ట్ చేశారు. యాజమాన్య బదిలీ సమయంలో ఆదోని పురపాలక సంఘం కమిషనర్ అధికారికంగా ఇచ్చిన కేడర్ స్ట్రెంగ్త్ వివరాలను కూడా ఇష్టానుసారం మార్చేశారని వాపోతున్నారు. ఆదోనిలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఒక విద్యాశాఖ ఉద్యోగి కొందరు మున్సిపల్ ఉపాధ్యాయులకు అనుకూలంగా నిబంధనలకు వ్యతిరేకంగా మద్దతు ఇస్తున్నారని, తమకు న్యాయం జరగాలంటే ఎవరితో చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అన్యాయంపై ప్రశ్నించిన ఉపాధ్యాయులకు సంబంధం లేని ప్రశ్నలు, గద్దింపులూ బెదిరింపులు ఎదురవుతున్నాయని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

26న ధర్నాను జయప్రదం చేయాలి

- హమాలీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే నిరసనను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శనివారం ఎఐటియుసి అనుబంధ సంఘాలైన సూపర్ బజార్ ఫర్టిలైజర్ హమాలీ, మార్కెట్ యార్డు హమాలీ, రైల్వే స్టేషన్ ఆటో కార్మికుల అడ్డాల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ నష్టాల పేరుతో ప్రయివేటీకరించడానికి పూనుకుంటోందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజిస్తూ కార్మికులను, కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. జిల్లా సహాయ కార్యదర్శి ఒబి.నాగరాజు, కార్యదర్శి బి.వెంకన్న, వైటి.భీమేష్, ఎఐటియుసి జిల్లా సమితి సభ్యులు కల్లుబావి రాజు, రామాంజనేయులు, భీమన్న, శ్రీనివాసులు, గుంటెప్ప, హనుమంతు, కృష్ణ, దుర్గ ఉన్నారు.

నినాదాలు చేస్తున్న హమాలీలు

ఘనంగా నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ఎస్సీ కాలనీలో నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ 9వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా మహిళా అధ్యక్షులు కదిరికోట బతుకమ్మ, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ ఆలూరు తాలూకా అధ్యక్షులు రామాంజనేయులు పాల్గొని జెండాను ఎగురవేశారు. బతుకమ్మ, రామాంజనేయులు, సంఘం డివిజన్ నాయకులు సుమాల ఛార్లెస్ మాట్లాడారు. ఆలూరు తాలూకా ఉపాధ్యక్షులు నర్సప్ప, ఆదోని మండల అధ్యక్షులు నరసప్ప, పెద్దమరివీడు గ్రామ నాయకులు పురుషోత్తం, రోగెన్న, డేవిడ్, పెయింటర్ బాబు, రాజేష్, గోవిందమ్మ, ప్రకాశమ్మ, లక్ష్మి, వేణు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నవ్యాంధ్ర నాయకులు

శబరిమలకు పాదయాత్ర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని నుంచి శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లిన ఆదోని దీక్ష బృందం శనివారం శబరిమల కొండకు చేరుకుంది. ఎస్‌కెడి కాలనీలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి అక్టోబర్ 28న బయల్దేరి శనివారం చేరుకున్నారు. ఈ యాత్ర ఆదోని నుంచి అనంతపూర్, బెంగళూరు, సేలం, దిండుగల్, తెని, కుమ్లి, సత్రం, పులిమేడు మీదుగా సాగింది. శ్రీనివాస్ ఆచారి, మల్లి, రంగన్న, పంపారెడ్డి, ప్రహ్లాద, శ్రీనివాస్, మణికంత, సునీల్, నల్లన్న, సోము ఈ యాత్రలో ఉన్నారు.

శబరిమల చేరుకున్న స్వాములు

ఇతరుల మెప్పు కోసమే కల్పిత ప్రచురణ

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

మీడియాతో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ఇతర నేతల మెప్పు కోసమే ఓ పత్రికలో కల్పిత ప్రచురణలు చేస్తూ తమ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ మండిపడ్డారు. శనివారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆదేశానుసారంతో ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి.. ప్రభుత్వ అనుమతి పొంది టిడిపి సీనియర్ నాయకులు కపటి మాధవ గరుసు తోలుకోవడంలో తప్పేముందని, నిజానిజాలు తెలుసుకుని వార్తలు ప్రచురించాలని తెలిపారు. గరుసు తవ్వేందుకు ఎస్.కొండాపురం సర్వే నెంబర్-1లో 2.50 ఎకరాలకు తహశీల్దార్ 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' ఇచ్చారని చెప్పారు. మైనింగ్ అధికారుల చేత కూడా బంట్రోతుల మాధవ పేరు మీద అనుమతులు పొందిన సర్టిఫికెట్ తీసుకున్నట్లు తెలిపారు. తన ముఖ్య అనుచరుడు కపటి మాధవ అంటూ పత్రికలో ప్రచురించడం ఏమిటని, ప్రతి టిడిపి కార్యకర్త తనకు ముఖ్య అనుచరులేనని చెప్పారు. గరుసు తవ్వుకోవడానికి ప్రతి రెండు నెలలకోసారి సంబంధిత శాఖ అనుమతి పొందాల్సి ఉంటుందని గుర్తు చేశారు. అవినీతి అన్నది తమ ఇంట, వంట లేదని తెలిపారు. తాను చురుకుగా ప్రజల్లో తిరుగుతున్నానని, అధిష్టానం వద్ద మంచి పేరు ఉందని, ఏ ఒక్క పదవీ రాకుండా అడ్డుకునేందుకే కొందరు వెనకుండి పోయిస్తున్న అసత్య ఆరోపణలేనని చెప్పారు. 20 ఏళ్లుగా ఇబ్బందులకు గురిచేసినా, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా కల్పిత వార్తలు ప్రచురిస్తే భవిష్యత్తులో పరువు నష్టం దావా వేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రియాంక గాంధీ గెలుపుతో ఉత్సాహం

- కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేరళ రాష్ట్రం వయనాడ్ లోకసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లోకసభ సభ్యులుగా ప్రియాంక గాంధీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో నూతనోత్సాహాన్ని నింపిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఖాసీం వలీ, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్ తెలిపారు. శనివారం లోకసభ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ గెలవడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. లోక్‌సభ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ తన సమీప అభ్యర్థిపై 4,08,036 ఓట్ల మెజార్టీతో గెలుపొందారని తెలిపారు. ఈ ఘనవిజయం రాబోయే సార్వత్రిక లోక్ సభ ఎన్నికల్లో ఘన విజయానికి శుభ సూచకమని పేర్కొన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. బనవాసి జైపాల్, అజిత్ బాష, వలీ సాబ్, అజయ్, శ్రీరాం పాల్గొన్నారు.